# గుడ్డిపిల్ల

**తా**డేపల్లిగూడెం స్టేషనులో ఎక్కింది, ఆ బాలిక, బెజవాడబండి. కూడా ఒక చిన్న పిల్లవాడు ఆ బాలిక చేయిపట్టుకొని దారిచూపుతూ ఉన్నాడు. చినిగిపోయిన గుడ్డల్లో మేఘాల్లో చంద్రుడిలా వుంది ఆమె. ఆమె అందం ఆమెకే తెలీదు.

"వినవే పల్లవా మృదూ చరణా కరుణా వితరాణా గూణా భరాణా" అని పల్లవి ప్రారంభించింది. ఒక్కసారిగా పెట్టె నిశ్శబ్దం ఆవరించింది. విరిసిన వసంతోదయంలో మల్లికా పుష్పసుగంధంలా ఆ కిన్నెర స్వరం, మహావేగంతో పరుగెత్తుతున్న రైలు హోరు శ్రుతికాగా, ఆ పెట్టె అంతా ప్రవహించింది.

"జనవీభు దానా తిచ్చిన దంటాకాటవికి" అందరి హృదయాలూ కదలిపోయినవి. కొండచిలువ పెనవేసుకొన్న జింకల్లా, చైతన్య రహితులై వింటున్నారు యావన్మందిన్నీ.

"మునివేషధారినై చదియేదననావీని" ఎవరి భాష గాంభీర్యం ఎంతవుందో ఆ లోతు! వినీలమై వినిర్మలమై కాంతి దాల్చింది.

ఆమె తలముడి కంగారుగా విడిపోయి, నీరులేని మేఘంలా చెదిరి వుంది. కళ్ళు చూస్తూవున్నట్లే వున్నవి. కాని సంజ్ఞా జ్ఞానరహితాలై ఎండిపోయిన చెరువుల్లా మెరుస్తున్నవి. తీర్చి దిద్దిన కనుబొమ్మలు, సమమైన ముక్కు, చిన్ననోరు, వణికే పెదవులు ఆమె మొహాన సుందర శ్రీసాక్షాత్కారింపజేస్తున్నవి.

ఆమె పాట ఒక సెలయేరులా మర్మరించింది. రాళ్ళగుట్టలో జలజల లాడింది. సుడిగుండాలు చుట్టింది. చెట్లనీడ సమతలంలో పోయింది. ఆగింది ఒక బండరాయి కింద మాయమై అవతల తిరిగి ప్రత్యక్షమైంది. ఆ గానం శ్రావణమాసపు పచ్చికలా అల్లుకుపోయింది. శరదృతు పుష్పాలై వికసించింది. నవవసంతంమల్లే ఆనందపర్వమై పోయింది.

## 2

**అ**ప్పుడే ఒక స్టేషనులో ఎక్కా డొక బ్రాహ్మణోత్తముడు. వచ్చీరాగానే ఆ పాటకు అడ్డంవస్తో ఒక హాస్యవచనం అన్నాడు. ఆత్మానందం మానవాతీతం కాబట్టి లోతునీళ్ళల్లో మునిగిన వాళ్ళలా, మనుష్యులు ఆ ఆనందం అట్టేసేపు భరించలేరు. ఈ హాస్యవచనం ఒక్కసారిగా ఆ పెట్టెలోవున్న మానవలోకానికి నిట్టూర్పు యిచ్చింది. తెప్పరిల్లజేసింది. ఆ బాలిక పాట మానివేసింది.

కొత్తగా వచ్చిన హాస్యగాడు జబ్బు హాస్యంతో ప్రారంభించాడు. తనకు తగని జబ్బున్నాడు అది తిండిజబ్బు. భోజనానికి వెడితే మొగపెళ్ళివారికి చేసిన శాకపాకాలన్నీ తనవిస్తట్లోనే మాయమౌతో వుండేవిట. వైద్యుడిది మహారోగం అన్నాట్ట. దానికి ఉదయాన్నే మినపసున్ని తాటికాయలంత మాత్రలుచేసి ఒక శేరు తేనెపాకం అనుపానంగా, ఒక డజను సేవించమన్నాట్ట. ఇత్యాది హాస్యంతో, కోమటిహాస్యం, భావహాస్యం, గొల్లహాస్యం, బుడబుక్కలహాస్యం, కుక్కకూతలు, నక్కకూతలు కుప్పేశాడు. ఆ రైలు పెట్టెలో మనుష్యులు విరగబడి నవ్వారు. కళ్ళవెంబడి అందరికీ నీళ్ళుకారినై. డొక్కలు నొక్కుకున్నారు. ఒకళ్ళమీద ఒకళ్ళు పడ్డారు. ఎంత హాస్యానికన్నా చిరునవ్వులు మాత్రం వెదజల్లుతుంది హిందూ స్త్రీ జనం. అక్కడ ఆడవాళ్ళు ఒళ్ళుమరచి నవ్వుపొంగుల్లో ఊగిపోయారు. అక్కడనుండి డబ్బు వసూలు చేయడం ప్రారంభించాడు. కాన్లు, అణాకాసులు, అర్ధణాలు, రెండణాల కాసులు గలగల అతని హస్తంలోకి ప్రవహిస్తూ అక్కడే మాయమయ్యాయి. అతగాడు కొంచెం గుంటుపల్లి భాస్కరుడి ఇంద్రజాలం కూడా ఎరుగున్నవానిలా కనబడ్డాడు. ఒక పన్నెండణాలు దాకా పోగుబడింది కాబోలు, అదంతా "హూత్తని" తెల్లపోయి చూస్తూవున్న ఒక కుఱ్ఱవాడి లాగులోంచి గలగల రాలించాడు చిల్లరంతానూ. "అమ్మదొంగా" అన్నాడు. పెట్టె అంతా ఘొల్లుమని నవ్వింది.

"మీరు చల్లగా వుండాలి. నేను పచ్చగా వుండాలి. మీ ధాన్యాలు నా గాది నిండాలి. మీ నవ్వులోంచి ధనవర్షం కురియాలి. జయా! విజయీ భవ!! దిగ్విజయీభవ!!! మీరెప్పుడూ రైలు ప్రయాణం చేస్తూవుండాలి. బాబూ! సెలవండి" అని తర్వాత స్టేషనులో దిగిపోయాడు. వేరే పెట్టె ఎక్కినాడు కాబోలు.

## 3

**ఇం**తసేపు ఆ గుడ్డిపిల్ల నిర్ఘాంతపోయి నిల్చున్నది. అప్పుడప్పుడూ వేళాకోళం మాటలకి చిరునవ్వు నవ్వుకుంది. కూడా వున్న ఆ పిల్లవాడు పకాలున నవ్వుతూవున్నాడు. హాస్యం పొడుగునా.

ఆ బాలిక, గొంతుకు సవరించుకుంది,

*"ఎంతనీ వేడినా, ఎక్కడ వుందువో*
*కంతు జనకరామా!!"*

అని హాయిమనే కృతి ఒక్కటి ఆలాపన చేసింది.

ఆ హాస్యపుగాడిమాటలే పక్క ఆయనకి జ్ఞాపకంచేస్తూ విరగబడినవ్వుకుంటూ వున్న ఒక ముసలి కమ్మాయన "వుస్ పిల్లా! వుండు" అన్నాడు.

ఆ బాలిక అల్లాగే నిల్చుండిపోయింది. ఆ పసిపాప డబ్బు అడుక్కోబోగా "ఛీ, పో, ముట్టుకుంటావు: చిల్లర అయిపోయిందిరా" అని వరసగా అంటూనే వున్నారు.

ఆ బాలిక అల్లాగే చైతన్యరహితంగా నిల్చునేవుంది. రయిలు కదిలి పోతూనేవుంది.

ఆరుకాన్లు వసూలయ్యాయి. ఆ అంధబాలిక జ్ఞానశూన్యాలైన కళ్ళల్లో వేడినీళ్ళు తిరుగుతునే ఉన్నవి. ఆమె నిర్మలహృదయం మాటలేని ఏడుపులో సుడి తిరిగింది. పిల్లవాడు వచ్చి ఆ అణాన్నర ఆ బాలిక చేతుల్లో పెట్టాడు. ఆమె మొహంవంక తేరిపార చూశాడు. ఆమె చెయ్యి పట్టుకున్నాడు. వాడి లేత మనస్సు చివుక్కుమంది. వాళ్ళ ఇద్దరకూ ఒకళ్ళ హృదయం ఒకళ్ళకి విస్పష్టమే. ఇద్దరూ ఒక తలుపుమూల యిరికి కూలబడ్డారు. ఒదిగిపోయారు. చూపులేని ఆ బాలిక కళ్ళు, చూపు పుట్టని ఆ పిల్లవాడి హృదయం ఒకటికొకటి ఆలింగనం చేసుకొన్నవి. ఆ బాలకుడు కంటినీరు ఆ బాలిక చేతులు అద్దుకుని ఆపుకోపోయాడు.

## 4

**ఆ** బాలిక పాట ప్రారంభించక పూర్వమే ఒక వ్యక్తి రైలు పెట్టె ఎక్కాడు. అతడూ రైలు బిచ్చగాడే – ఒక చెయ్యిలేదు.

ముప్పైయేళ్ళుంటాయి, చింకిగుడ్డా, చిరిగిపోయిన చొక్కాతో ఒక పిల్లంగ్రోవి ఎడంచేత్తో పట్టుకుని రైలు ఎక్కాడు. అప్పుడే ఆ బాలిక తన దివ్యగానం ఆలాపన చేసింది. తర్వాత జరిగిన కథ అంతా చూస్తూనేవున్నారు.

ప్రపంచం అంటే కోపంగల మనిషి. వెనక రైల్వేపోర్టరుగా వుండి రైలు క్రిందపడిపోయి చేయి పోగొట్టుకున్నాడా బిచ్చగాడు. నా అనేవారు లేకుండా వుండేవాడు. జీతంలో వచ్చిన నాలుగురాళ్ళు మిగుల్చుకుంటూ, గూడ్సు స్టేషనులో అప్పుడప్పుడూ దొంగతనం చేసిన వస్తువులు అమ్మగా వచ్చిన డబ్బూ, రైలులోంచి దిగిన ప్రయాణీకుల సామాను మోయడం వల్ల వచ్చిన కూలి, టిక్కెట్టు లేనివాళ్ళను ఇంజను దగ్గరనుంచో, గార్డు పెట్టిదగ్గరనుంచో పోనిచ్చినందుకు లంచం మామూళ్ళు అంతా కలిపి నూరు రూపాయలు మూటకట్టాడు. ఇంతట్లో చెయ్యిపోయినందుకు, రాజమండ్రి రైల్వే ఆస్పత్రిలో మూడునెలలు వున్నాడు. అప్పుడు తాను ఇంటిలో దాచుకున్న డబ్బు ఎవ్వరో మటుమాయం చేశారు. ఉద్యోగం పోయింది. పెండ్లిలేదు. దాంతో అతనికి మతిపోయింది. దిక్కులేనివాడికి దేవుడుకాదు, తిరిపెమే దిక్కు. బిచ్చగాళ్ళకు కొందరు గురువులు వుంటారు. అతడు ఓ గురువు దగ్గర పిల్లనగ్రోవి బాగావూదడం, అందుమీద వేదాంతం పాటలు, భక్తిపాటలు పాడటం నేర్చుకున్నాడు; రైలు బిచ్చం సాగించాడు.

రైలేగా ద్రోహం చేసింది! ఆ వచ్చిన డబ్బుతో కాఫీహోటల్లో తినడం, కల్లుపాకదగ్గిర గౌళ్ళపుల్లమ్మకూతురు పోసే ధవళసుధారసం గళ గ్రాహంగా సేవించి, సింధూరా నిమిషత్వం, మహాయోగంలో మైకం సంపాదించి అమరుడౌతుంటాడు.

అలాంటివాడు ఆ గుడ్డిపిల్ల పాట విన్నాడు. అతని మొఱటు మనస్సు గాలిలో వూగిపోయింది. దోహదం చేసిన మొండిచెట్టు వికసించినట్లు చిగురుదాల్చింది. ఏ ఆవేశమో అతనికి తెలియదు. అతనికి కళ్ళు నీళ్ళు తిరిగినై.

మనుష్యుల చంచలత్వమూ, కఠినత్వమూ చూస్తే అతనికి అసహ్యం వేసింది. ఎవ్వరూ తియ్యకుండా, ఆ గుడ్డిపిల్లను నిరసించగానే, అతడు ముట్టెవంచిన కారుదున్న

అయిపోయినాడు. తాను పొద్దుట్నుంచీ పోగుచేసుకున్న అరణాల డబ్బులూ ఆ అమ్మాయి చేతిలో వేసి, రైలు ఆగగానే దిగి చక్కాపోయాడు. ఆ అమ్మాయికి ఇంత డబ్బు ఎవరిచ్చారో తెలవలేదు. "దేవుడులాంటి దయగల ప్రభువు ఎవరిచ్చారో!" అనుకున్నది.

## 5

**ఆ** గుడ్డి పిల్లకు జ్ఞానం వచ్చినప్పటినుంచీ ఇల్లా ముష్టి ఎత్తుకుంటూ రైలు పక్క గ్రామంలో ఒక బహుకుటుంబీకుడు, మంచి అంతఃకరణగల ఒక రైతు ఇంటిలో ఒక పంచను వుంటూ వుండేది. ఊళ్ళో ఒక పెద్ద సంసారి తన పిల్లకు సంగీతం నేర్పిస్తూవుండే వీధివాకిట్లో కూర్చుని సంగీతం చెవులార వినేది. ఇల్లా ఏకలవ్యుడుగా అద్భుతమైన గాన విద్య సంపాదించుకుంది. ముష్టిబాగా వచ్చేది. ఆ డబ్బు మహా ఇల్లాలైన రైతు భార్యకు దాచయిచ్చేది.

పెద్దదవుతూవున్న కొద్దీ ఏదో భయం, సిగ్గు కలుగుతూ వుండేది. ముష్టికి తిన్నగా వెళ్ళక ఇదివరకు పోగుచేసుకున్న డబ్బులు ఖర్చు చేసుకుని గంజి కాచుకుంటూ వుండేది. తల్లి ఎవరో తండ్రి ఎవరో, ఎల్లా ఆ రైతు ఇంట్లో చేరిందో ఆ పిల్లకు ఏమీ తెలియదు.

ఒక రోజున చేబ్రోలు ముష్టికి పోయి మధ్యాహ్నాం కాల్వగట్టున వంట చేసుకుంటూ వుండగా, ఒక పసిపిల్లవాడు మూడేళ్ళవాడు ఆ అమ్మాయి దగ్గిరకు వచ్చాడు. ఎక్కణ్నుంచి వచ్చాడో! ఆ గుడ్డిపిల్ల అతన్ని వళ్ళోకి తీసుకొంది. అప్పట్నించి వాళ్ళిద్దరూ, ఒక తల్లిబిడ్డల్లా అయ్యారు. అతడు దారి చూపించడం, ఆమె పాటపాడడం – అల్లా నాలుగేళ్ళు గడిచినై.

## 6

**ఆ** రోజు సాయంత్రం కాల్వగట్టున వంట చేసుకుంటూ వుంది. పిల్లవాడు చితుకులు ఏరి తెచ్చి యిస్తున్నాడు. ఆ సమయంలో ఆ సంధ్యారుణ కాంతుల్లో ఒక పురుషుడు ఆ చెట్టుకిందికి వచ్చాడు. అతని మొహం చిరునవ్వులు నవ్వుతూవుంది. కళ్ళులేని ఆ కబోది చెవులు, శరీరం యావత్తూ అతి సున్నితమైన గ్రహణశక్తి సంపాదించుకున్నవి. ఆ కొత్త మనిషి రాక కనిపెట్టింది.

"ఒరే ఎవర్రా ఆ వచ్చింది?"

ఆ పిల్లవాడు ఆ మనిషి దగ్గిరకు పరుగెత్తుకుని వెళ్ళాడు. కుంటిచెయ్యి చూశాడు, పిల్లంగ్రోవి చూశాడు.

"ఆరోజు మనిషి"

ఆ పిల్ల గ్రహించింది. ఆమె తెలతెలపోయింది. గుండె కొట్టుకుంది. తల వాల్చుకుని వంటచేస్తూనే వుంది.

ఆ మనిషి పిల్లంగ్రోవి తీశాడు.

*"ఏదిర లక్ష్మణ సీత,*
*పర్ణశాలలో లేదెందుశాత–"*

అని పాటపాడినాడు. ఆ తేనెచుక్కల ధ్వని ఆ సంధ్య అంతా ఆక్రమించుకుంది. ఆ పిల్లవాడు అతని దగ్గరగా జేరి మొహంచూస్తూ కూచున్నాడు. ఆ అమ్మాయి వంటచేస్తూనే వుంది.

*"రారోరి చిన్నవాడా, మావాడా*
*రారోరి చిన్నవాడా-"*

చీకట్లు పూర్తిగా అలుముకువస్తూ వున్నవి. నక్షత్రాలు మినుకుమినుకు మంటూ ఆకాశాన్ని అలంకరించాయి.

*"ఎందుకైనా వ్రుంచినావో బ్రందికానాలో*
*రామయ్య తండ్రీ..."*

ఆ బాలిక వంట పూర్తిఅయింది. నిప్పులు ఆర్పేసింది. బిచ్చగాడు ఆమె దగ్గరగా పోయి కూచున్నాడు.

ఎడంచేయి మొండిది. అది పిల్లంగ్రోవికి నొక్కుకుని కుడిచేతి వేళ్ళతో వూదుతాడు.

***"నీకూ నీవారు లేరు. నాకూ నావారు లేరు.***
***ఏటిఒడ్డునా ఇల్లు కడదాం పదరా!"***

ఆ పాట అమృతమయంగా ఆ చీకట్లో వ్యాపించింది. కాల్వనీళ్ళు నిర్మలంగా ప్రవహించినై.

"నాకు పెళ్ళిలేదు; నేనూ ముష్టివాడినే. మనం ఇద్దరం ఎందుకు పెళ్ళి చేసుకోకూడదు?"

ఆ అమ్మాయి ఆలోచించుకుంటూవుంది. వేయి ఆలోచనలు పోయాయి. ఒళ్ళు వొణికింది. అప్రయత్నంగా అతని దగ్గిరకు జరిగింది. మొహం తడిమింది. ఆ మనుష్యుడికి వళ్ళు జలదరించింది. ఆ చింపిగుడ్డ అమ్మాయి అప్సరసలాతోచింది. తన జీవితం జ్ఞాపకం వచ్చింది. ఒక గుడిలో మోకరించిన భక్తుడయ్యాడు. ఆ బాలికను గట్టిగా తన గుండె కదుముకుందామనుకున్నాడు. చూపులేని ఆ కళ్ళుచూసి కళ్ళనీళ్ళు నింపుకున్నాడు. ఆ బాలిక అతని తల నిమిరింది. కళ్ళు తుడిచింది. అతని గుణగణాలు ఎలా అర్థమయ్యాయో!!

"ఆ పిల్లవాడు నాకు తమ్ముడు. చిన్నతనాన్నుంచి పెంచుకున్నా."

"నాకూ తమ్ముడే; నా బిడ్డడే అవుతాడు. ఇక్కణ్ణుంచి నేనూ పెంచుకుంటా."

ఆ నక్షత్రాలే సాక్షిగా, ప్రక్కన ప్రవహించే గోదావరి నీరు సాక్షిగా, వాళ్ళిద్దరూ ఆ శుభముహుర్తంలో భార్యాభర్తలయ్యారు. ఒకళ్ళ కౌగిలింతలో ఒకళ్ళు కలసి మెలసి కరిగిపోయారు.

ఆ పసి పిల్లవాడు హృదయంతో "తథాస్తు" అని నవ్వుకున్నాడు.